
సాక్షి
అనకాపల్లి
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్
నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. 8లో



ఆశాజనకంగా నీటిమట్టం
మాడుగుల: పెద్దేరు జలాశయం నీటిమట్టం ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం 134.80 మీటర్లు ఉండడంతో రబీకి ఇబ్బంది ఉండదు.



నూకాంబిక మాలధారణ
అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి 41 రోజుల దీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి.

వెల్లువలా

పెట్టుబడులు రూ.1.17 లక్షల కోట్లు
ఉద్యోగాలు 81,450

గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా.. డేటా సెంటర్ హబ్‌గా ఉమ్మడి విశాఖ
- పూడిమడకలో రూ.1.10 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- 61 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్న ఎన్టీపీసీ
- కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- 20,450 మందికి ఉపాధి అవకాశాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో కీలక ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. ఐటీ హబ్‌గా పర్యాటక డెస్టినీగా భాసిల్లుతున్న వైజాగ్.. ఇప్పుడు డేటా సెంటర్‌కు ప్రధాన కేంద్రంగానూ, గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్‌గా మారనుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల పెట్టుబడితో 61 వేల మందికి ఉపాధి కల్పించేలా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రూ.7,210 కోట్ల పెట్టుబడితో 20 వేల పై చిలుకు ఉద్యోగాలు కల్పించేలా డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఉమ్మడి విశాఖ చరిత్రలో ఒకేసారి రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులు, 80 వేలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

కీలక ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖపట్నం మారుతోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం.. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో నగరంలో పెట్టుబడులకు, భారీ ప్రాజెక్టులకు ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రెండ్రోజుల క్రితం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ఇందులో సింహభాగం విశాఖకే చెందినవి కావడం గమనార్హం. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏకంగా రూ.1,17,210 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో విశాఖ జిల్లా పారిశ్రామిక రంగంలో సరికొత్త విభాగాలకు కేంద్ర బిందువుగా మారుతోంది.

గ్రీన్ ఎనర్జీ కేరాఫ్ పూడిమడక

దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు అచ్యుతాపురం మండలంలోని పూడిమడక చిరునామాగా మారనుంది. ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా లక్షా 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో న్యూ ఎనర్జీ పార్కు నిర్మించనుంది. ఈ పార్కులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, హైడ్రోజన్ సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయి. ఇంధన రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కొత్త తరహాలో ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రణాళికలు తయారు చేసింది. రెండు దశల్లో పూర్తి చేసే ఈ ప్రాజెక్టు ద్వారా 61 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రానున్నాయి.



ప్రాజెక్టు పేరు : ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్కు
పెట్టుబడి : రూ.1,10,000 కోట్లు
విస్తీర్ణం : సుమారు 1000 ఎకరాలు
ఉపాధి అవకాశాలు : 61 వేల మందికి
మొదటి దశ : రూ.55 వేల కోట్లు, 30 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2027
రెండోదశ : రూ.55 వేల కోట్లు, 31 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2033

కాపులుప్పాడలో డేటా సెంటర్

మధురవాడ ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌కు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన విషయం విదితమే. రూ.14,634 కోట్ల పెట్టుబడులతో 200 మెగావాట్ల సామర్థ్యంతో డేటాపార్క్ రాబోతోంది. తాజాగా 100 మెగావాట్ల సామర్థ్యంతో మరో డేటా సెంటర్ దాని సమీపంలోని కాపులుప్పాడ ప్రాంతంలో ఏర్పాటుకు ఎస్ఐపీబీ పచ్చజెండా ఊపింది. వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ సంస్థ ఈ డేటా సెంటర్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రూ.7,210 కోట్ల పెట్టుబడులతో 20,450 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలని సంకల్పించారు. మొత్తంగా ఈ రెండు ప్రాజెక్టులూ పూర్తయితే విశాఖ నగరం ఆంధ్రప్రదేశ్‌కు డేటా సెంటర్ హబ్‌గా మారనుంది.



ప్రాజెక్టు పేరు : డేటా సెంటర్
ఎవరి ఆధ్వర్యంలో : వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్
పెట్టుబడి : రూ.7,210 కోట్లు
ఉపాధి అవకాశాలు : 20,450 మందికి
ప్రత్యక్షంగా : 14,825 మందికి
పరోక్షంగా ఉపాధి : 5,625 మందికి
ప్రాజెక్టు పూర్తయ్యేది : 2026
మొదటి దశలో.. : 10 మెగావాట్లు
రెండో దశలో : 40 మెగావాట్లు
మూడో దశలో : 50 మెగావాట్లు

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్: టెన్త్ పరీక్షల్లో జిల్లాలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. జిల్లాలోని ఎంఈవోలు, హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచి, వారిలో ప్రజ్ఞను వెలికితీయాలన్నారు. సబ్బవరం మండలం నంగినారపాడు గ్రామంలో పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు తయారు చేసిన ఎల్ఐపీ ప్రోగ్రాంలపై ఆరా తీశారు. ప్రతీరోజూ లెర్న్ ఎ వర్డ్‌పై విద్యార్థులకు బోధించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను విద్యార్థులందరూ వినియోగించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఈవో బి.లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖాధికారులు ఎస్‌ప్రేమ్‌కుమార్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐలకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో రెవెన్యూశాఖలో భారీగా పదోన్నతులు కల్పించడంతో పాటు బదిలీలు చేశారు. 24 మంది ఎంఆర్ఐలకు సీనియర్ అసిస్టెంట్‌లు(డిప్యూటీ తహసీల్దార్లు)గా పదోన్నతి కల్పించారు. వీరిలో ఐదుగురికి అల్లూరి జిల్లా నుంచి, మరో ఐదుగురికి విశాఖ జిల్లా నుంచి పదోన్నతి కల్పించి, డిప్యూటీ తహసీల్దార్లుగా నియమించారు. అదే కార్యాలయాల్లో ఎంఆర్ఐ-1, ఎంఆర్ఐ-2గా ఉన్న మరో 9 మందిని ఎంఆర్ఐలుగా బదిలీలు చేశారు. వీరికి భూ రీ సర్వే ప్రక్రియ కోసం ప్రత్యేకంగా పదోన్నతులు కల్పించారు. ఈమేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల నిర్మాణంతో మరింత చేరువగా వైద్యం



కాంక్రీట్ పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

మాకవరపాలెం: మెడికల్ కళాశాల నిర్మాణంతో పేదలకు వైద్యం మరింత చేరువవుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద 52 ఎకరాల్లో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం ఎమ్మెల్యే కళాశాల కాంక్రీట్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే గాక మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. కళాశాలను మంజూరు చేసిన సీఎం జగన్‌కు అందరం రుణపడి ఉండాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన హరిబాబు, బొడ్డు గోవిందరావు, పెట్ల భద్రాచలం, సర్వేశ్వరరావు, ఏపీఎంఐడీసీ అధికారులు పాల్గొన్నారు.

13 నుంచి టెక్నోప్రెన్యూర్‌షిప్‌పై శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజ్(ఎన్ఐ-ఎంఎస్ఎంఈ) సంయుక్తంగా ఈ నెల 13 నుంచి ఆరు రోజుల పాటు అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాయి. సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై టెక్నో ప్రెన్యూర్‌షిప్ నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డిగ్రీ విద్యార్హత కలిగిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్‌లు ఈ శిక్షణ తరగతులకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా 95992 29217 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, డాక్టర్ అనింద్య రాయ్ చౌదరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రెండు స్టోన్ క్రషర్లకు గ్రామస్తుల ఆమోదం



గ్రామస్తుల డిమాండ్లపై మాట్లాడుతున్న అంజని స్టోన్‌క్రషర్ అధినేత సింగరెడ్డి

అనకాపల్లిటౌన్: తుమ్మపాల,మార్టూరు గ్రామాల్లో స్టోన్‌క్రషర్ల ఏర్పాటుపై బుధవారం ఆయా గ్రామాల్లో ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. తుమ్మపాల సంతబయల ప్రాంతంలో అంజని స్టోన్‌క్రషర్‌ను ఆరుహెక్టార్లలో ఏర్పాటు చేసేందుకు, మార్టూరులో 10.13 హెక్టార్లలో ర్యాంక్‌సిలికాన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్‌లిమిటెడ్ స్టోన్‌క్రషర్ ఏర్పాటుకు గ్రామస్తుల నుంచి అంగీకారం లభించింది. మొక్కలు నాటాలని, తాగునీటి సౌకర్యం,ఉపాధి అవకాశాలు కల్పించాలన్న గ్రామస్తుల డిమాండ్లకు యాజమాన్యాలు అంగీకరించాయి. డీఆర్వో వెంకటరమణ, కాలుష్య నియంత్రణమండలి జిల్లా ఈఈ వెంకటేశ్వర్లు, మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ జె.రవివర్మ పాల్గొన్నారు. మార్టూరులో సర్వేనంబర్ 1లో శ్రీనామకృష్ణయ్య(మధుకాన్)అనే మరో స్టోన్‌క్రషర్ ఏర్పాటుకు గ్రామస్తుల నుంచి చుక్కెదురైంది. అనుమతులు ఇవ్వొదంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ నివేదికను అమరావతిలో ఉన్నతస్థాయి అధికారులకు పంపిస్తామని డీఆర్వో హామీ ఇవ్వడంతో శాంతించారు.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతి

పాయకరావుపేట: మండలంలోని పెద్దూరు వద్ద సముద్రంలో స్నానం చేస్తుండగా గల్లంతైన యువకుడు మృతి చెందినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. కాకినాడకు చెందిన గుమ్మడి రిత్విక్(24) తన స్నేహితులతో సోమవారం సముద్ర స్నానం చేస్తుండగా గల్లంతైన విషయం తెలిసిందే. రిత్విక్‌కు ఈత రాకపోవడంతో సముద్రంలో మునిగిపోయి మృతి చెందాడు. మృతదేహం పెద్దూరు తీరంలో బుధవారం లభ్యమైనట్టు సీఐ తెలిపారు. ఎస్ఐ బి.జోగారావు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే మన లక్ష్యం

- ప్రతీ వార్డులో సమావేశాలు నిర్వహించండి
- పార్టీ ఏదైనా.. ప్రతీ పట్టభద్రుడిని ఓటు అడగండి
- కార్పొరేటర్లకు వైవీ సుబ్బారెడ్డి దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరం సమష్టిగా పనిచేద్దామని టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్పొరేటర్ల నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2.83 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని.. వీరిలో నగరానికి చెందిన 1.40 లక్షల మంది ఉన్నాయన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖ నగరం చాలా కీలకమన్నారు. ప్రతి కార్పొరేటర్ వార్డుల్లో సమావేశాలు నిర్వహించి.. ప్రతీ ఓటు వైఎస్సార్ సీపీకి వేసేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. సుధాకర్ పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి అడుగులు వేశారని, అతనికి వేసే ప్రతీ ఓటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేసినట్లేనని అన్నారు.



హాజరైన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు

సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే తనను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులందరితో కలిసి పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు మాట్లాడిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, కోలా గురువులు, పల్లా చినతల్లి, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

15న మహా బడ్జెట్



దాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వ సభ్య(ప్రత్యేక) బడ్జెట్ సమావేశం ఈ నెల 15న జరగనుంది. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమావేశంలో 2023-24 ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, 2022-23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ సభ్యుల ముందుకు రానున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను గతేడాది నవంబర్ 29, 39 తేదీల్లో స్థాయీ సంఘం ఆమోదించిన సంగతి తెలిసిందే..

- 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్‌లో సచివాలయ భవనాలు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.3కోట్ల నుంచి రూ.10కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- ఫ్లై ఓవర్ కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.30 కోట్ల నుంచి రూ.60కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నూతన నీటి సరఫరా లైన్ల కోసం 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.80 కోట్ల నుంచి రూ.100కోట్లకు సవరించాలని ఆమోదించారు.
- జీవీఎస్‌సీసీఎల్ సహకారం(స్మార్ట్ సిటీ) కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.200 కోట్ల నుంచి రూ.60కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.250కోట్ల నుంచి రూ.100 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- సోలార్ లైటింగ్ కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని, విరాళాలతో చేపట్టే పనుల కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.4కోట్లకు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.7.50 కోట్ల నుంచి రూ.19.50 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నది/సరస్సులు, నీటి ట్యాంకుల పరిరక్షణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.0.50 కోట్ల నుంచి రూ.2 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు సవరించాలని, సీఎండీఎఫ్ కింద ముడసర్లోవ పార్క్ అభివృద్ధి భూమి రక్షణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.13 కోట్ల నుంచి రూ.55 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.10 కోట్ల నుంచి రూ.80కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.

బడ్జెట్ అంచనాలు ఇలా..
- ప్రారంభపు నిల్వ రూ.48058.32 లక్షలు
- అన్ని పద్దుల కింద జమలు రూ.382262.50లక్షలు
- ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.430320.82 లక్షలు
- అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.406349 లక్షలు
- ముగింపు నిల్వ రూ.23971.82 లక్షలు

2023-24 ఆర్థిక సంవత్సరం అంచనాల బడ్జెట్ ఇలా..

	జమ(రూ.లక్షల్లో)	ఖర్చు(రూ.లక్షల్లో)
సాధారణ పద్దు	91458	17515
ఇంజినీరింగ్	38466	93761
లైటింగ్	---	15195
ప్రాజెక్టులు	19350	39970
ప్లానింగ్	31540	5242
యూసీడీ	52000	53735
విద్య	15	1907
పార్కులు, లీజర్స్	2000	11436
ప్రజారోగ్యం	11811.50	42588
మంచినీటి సరఫరా	43160	25985
జేఎన్ఎన్‌యూఆర్ఎం	10	5575
రాజీవ్ ఆవాస్ యోజన	---	500
అమృత్	15000	16400
ఇతర నిధులతో ప్రాజెక్టులు	19120	19120
ఆర్థిక సంఘం నిధులు	27600	28150
డిపాజిట్ల అడ్వాన్స్‌లు	30732	29270

మత్తు పదార్థాలకు బానిస కానివ్వొద్దు



బాలల హక్కుల కమిషన్ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కల్పనాకుమారి, పాల్గొన్న గొండు సీతారాం, గెడ్డం బుజ్జి

తుమ్మపాల: బాలలు, విద్యార్థులపై మాదక ద్రవ్యాల నీడ పడకుండా, వారు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జేసీ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు, ఎక్సైజ్, స్త్రీశిశు సంక్షేమ తదితర శాఖలు కలిసి తనిఖీలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల జోలికి పిల్లలు వెళ్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ బాలలు, విద్యార్థుల జీవితాలను ఛిద్రం చేస్తున్న మత్తు పదార్థాలు, బాలల అక్రమ రవాణాను అరికట్టే విధంగా ప్రణాళిక ప్రకారం అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వ సహకారంతో బాలల, మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గెడ్డం బుజ్జి, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ, జి.ఉమా, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, అడిషనల్ ఎస్పీ పి.ఎస్.ఎన్.రావు, జిల్లా అబ్కారీ అధికారి ఎస్.వి.రమణ, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ ఉషారాణి, అదనపు వైద్యాధికారి ఎం.శారదాబాయి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా గనులశాఖ అధికారిగా రాజు

అనకాపల్లిటౌన్: జిల్లా గనులశాఖ అధికారి(ఎఫ్ఏసీ)గా డి.వి.వి.ఎస్.ఎన్.రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ జిల్లా ఏడీగా పనిచేస్తున్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుబ్బారాయుడు అనారోగ్యంతో ఈనెల 20వ తేదీ వరకు సెలవు పెట్టడంతో రాజుకు ఆ బాధ్యతలు అప్పగించారు.

చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాలు వృద్ధి

డ్వామా పీడీ సందీప్



చెరువు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నక్కపల్లి: చెరువులను అభివృద్ధి చేయడం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ సందీప్ తెలిపారు. మండలంలోని కాగితలో బుధవారం ఆయన చెరువుల అభివృద్ధి, ఎవెన్యూప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అమృత్‌సరోవర్ కార్యక్రమంలో భాగంగా 122 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఒక్కో చెరువుకు రూ.20 నుంచి రూ.24 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. జాబ్‌కార్డు కలిగిన వేతనదారులకు ఇక్కడ పనికల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు 65 చెరువుల అభివృద్ధి పూర్తయిందన్నారు. ఇందుకోసం రూ.173 కోట్లు ఖర్చుచేసినట్టు చెప్పారు. రానున్న సంవత్సరానికి వేతనదారులకు 1.50 కోట్ల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. చెరువుల అభివృద్ధి, కూలీలకు పనికల్పన కోసం రూ.385 కోట్లు అవసరమవుతాయన్నారు. సర్పంచ్ పోతంశెట్టిరాజేష్, ఏపీడీ శ్రీను, ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు డీఎంహెచ్‌వో పరామర్శ


గలగండ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రిలో పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా


ఎస్‌సీసీయూ సెంటర్‌లో చికిత్స పొందుతున్న శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

పెదబయలు: మండలంలోని గలగండ గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని 108 వాహనం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సి జమాల్ బాషా తెలిపారు. జిల్లా ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అత్యవసర మెరుగైన వైద్యం అందించాలని, మెరుగైన వైద్యం కేజీహెచ్‌కు తరలించాలని సూపరింటెండెంట్ డా. కె.కృష్ణారావును ఆదేశించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను సందర్శించారు. రోజు వారిగా చికిత్స అందిస్తున్న కేసుల వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి ప్రసూతి విభాగం సమీపంలో శిశువును వదిలి వెళ్లిన విషయాన్ని తెలుసుకుని ఎస్.ఎన్.సి.యూ పాడేరు వద్దకు వెళ్లి వైద్యుల పర్యవేక్షణలో ఉన్న శిశువు ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన అనంతరం సంరక్షణ కోసం శిశు సంక్షేమ శాఖ అధికారికి అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి పాడేరు అదనపు జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లీలాప్రసాద్, ఆస్పత్రి సూపరింటెంట్ కృష్ణారావు, వైద్యాధికారులు పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, జిల్లా టీబీ పర్యవేక్షకులు వి. కిరణ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు వాహనాలపై కేసులు నమోదు


ఆర్టీవో అధికారి పట్టుకున్న వాహనం

అనకాపల్లిటౌన్: రికార్డులు సక్రమంగా లేని ఆరు వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు అనకాపల్లి రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగరం రహదారిలో బుధవారం వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. వాహనాల యజమానులకు రూ.75 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆటో నంబర్‌తో ఒక వ్యాన్ నడుపుతున్నట్టు గుర్తించామని చెప్పారు. ఆ వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు

రావికమతం: గొంప గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పండగ సందర్భంగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బుధవారం తెలిపారు. ట్రాన్స్ జెండర్లతో నిర్వాహకులైన చంద్రరావు, కంట్రెడ్డి సత్తిబాబు, మట్టా చిరంజీవి.. అశ్లీలంగా నేల డ్యాన్సులు వేయించారని చెప్పారు. గ్రామ దేవతల పండగల్లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భార్య హంతకునికి జీవిత ఖైదు

విశాఖ లీగల్ : జీతం డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో భార్యను అతి దారుణంగా హతమార్చిన భర్తకు యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమాన విధిస్తూ నగరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి గుత్తుల గోపి బుధవారం తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించని పక్షంలో అదనంగా ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు కొర్రా రవి (40) అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి సర్కిల్ అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్మపాడు గ్రామ నివాసి. లక్ష్మి కూడా అదే గ్రామానికి చెందినది. వీరికి 2016లో వివాహం జరిగింది. లక్ష్మి స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసేది. భార్య జీతం డబ్బులు తీసుకుని రవి వ్యసనాలకు బానిసయ్యాడు. ఇలా ఏడాది గడిచిన తర్వాత భార్యభర్తల మధ్య గొడవలు పెరగడంతో విడిపోవాలనుకున్నారు. ఆ కోపంతో 2017 జూలై 2న లక్ష్మి ఇంటికి రవి వచ్చి ఆమెపై భౌతికంగా దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రశేఖర్ రావు నిందితునిపై కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

16 మంది జూదరుల అరెస్టు

అనకాపల్లిటౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జూదం, కోడిపందాలాడుతున్న వారిపై దాడులు నిర్వహించినట్టు ఎస్పీ గౌతమి సాలి బుధవారం తెలిపారు. ఆరు కేసులు నమోదు చేసి, 16 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల నుంచి రూ.5,400, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఫిడే మాస్టర్‌గా సాహితివర్షిణి

విశాఖ స్పోర్ట్స్: చదరంగం ఫిడే మాస్టర్(ఎఫ్ఎం)గా నగర క్రీడాకారిణి ఎం.సాహితివర్షిణి టైటిల్ సాధించింది. 2300 ఫిడే ఎలో రేటింగ్‌తో నార్మ్స్ సాధించిన సాహితిని ఎఫ్ఎంగా ఇటీవల వరల్డ్ చెస్ ఫెడరేషన్ అధికారికంగా ప్రకటించింది. సాహితి వర్షిణికి ఇది చదరంగంలో నాలుగో టైటిల్ కావడం విశేషం. ఇప్పటికే వుమెన్ క్యాండిడేట్ మాస్టర్, వుమెన్ ఫిడే మాస్టర్‌లతో పాటు వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్స్‌ను సొంతం చేసుకుంది.

గురుకులంలో.. క్రీడా కుసుమాలు


జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి


బాలుర గురుకుల పాఠశాల మైదానంలో త్రోబాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

- చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- పోటీ ఏదైనా.. ఎక్కడైనా విజేతలు వీరే

నర్సీపట్నం: దృఢ సంకల్పంతో ప్రయత్నించి సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినా పట్టుదలతో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా, జోనల్, రాష్ట్ర క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. తమ పిల్లలను క్రీడాకారులుగా చూడాలన్న తల్లిదండ్రుల ఆశలను, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేస్తున్నారు. వారే నర్సీపట్నంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలుర గురుకుల విద్యార్థులు. చదువులో రాణించడమే కాదు. క్రీడల్లోనూ తాము చదువుతున్న విద్యాసంస్థ ప్రతిష్ట పెంచుతున్నారు.

పోటీ ఏదైనా.. ఎక్కడైనా పతకాలు దక్కించుకోవడంలో గురుకుల విద్యార్థులే ముందుంటున్నారు. కడప, విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్, టెన్నికాయిట్ పోటీలకు వీరు ఎంపికయ్యారు.

క్రీడలతో పాఠశాలకు మంచి గుర్తింపు..



మా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు, గుర్తింపు తీసుకువస్తున్నారు. రోజూ సాయంత్రం క్రీడలకు నిర్దేశించిన సమయం కంటే కొంత సమయం అదనంగా కేటాయిస్తున్నాం. ఆదివారం ఉదయం పది గంటల వరకు విద్యార్థులు స్వేచ్ఛగా ఆడుకునే వెసులుబాటు కల్పించాం. క్రీడల్లో ప్రతిభ చూపే వారు చదువులో మరింత రాణిస్తారు. ఈ గురుకులం ఏటా నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తోంది. క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించే వారిపై మరింత శ్రద్ధ చూపుతాం.

–ఎస్. వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

మెరికల్లా తీర్చిదిద్దుతున్నాం..

గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో చక్కటి పేరు తెచ్చుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా పతకంతోనే తిరిగొస్తారు. పదుల సంఖ్యలో ఉన్న వీరందరికీ శిక్షణ ఇచ్చేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాం. వీరిలో కూడా క్రీడలంటే ఆసక్తి, రాణించాలన్న పట్టుదల ఉంది.

–జి.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు, గురుకుల పాఠశాల

జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



మారు గ్రామంలో పుట్టి పెరిగినా, గురుకుల పాఠశాలలో సీటు రావడంతో సీహెచ్ శ్యామ్ కుమార్ (పదో తరగతి) చదువుతో పాటు క్రీడల్లోను శిక్షణ పొందుతున్నాడు. గత నెల 27, 28 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్-17 విభాగంలో పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని అతను చెబుతున్నాడు.

–సీహెచ్ శ్యామ్‌కుమార్ (పదో తరగతి)

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..



గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఒ. గోవర్ధన్ హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాడు. గత నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలనేది లక్ష్యమని తెలిపాడు.

- గోవర్ధన్

టెన్నికాయిట్‌లో రాణిస్తూ..



ఎనిమిదో తరగతి చదువుతున్న పి.మణికంఠ టెన్నికాయిట్‌లో జిల్లా, జోనల్ స్థాయిలో పతకాలు సాధిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో విశాఖలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. జనవరి 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే తన ధ్యేయమని తెలిపాడు.

- పి.మణికంఠ

రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు...



గత డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో జరిగిన బేస్‌బాల్ (విభాగం-17)లో జి.నరసింహనాయుడు (తొమ్మిదో తరగతి) ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జనవరి 29,30 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాడు. ఆరో తరగతి నుంచి క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు అందిస్తున్న శిక్షణను అందిపుచ్చుకుంటూ జిల్లాస్థాయిలో మంచి ఆట తీరు ప్రదర్శించాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

- జి.నరసింహనాయుడు (తొమ్మిదో తరగతి)

బాక్సింగ్ క్రీడాకారులకు ఎమ్మెల్యే గణేష్ అభినందన


బాక్సింగ్ క్రీడాకారులతో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అభినందించారు. నర్సీపట్నం నింజాస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న ఎం.లాస్య, జి.జ్యోతి, కె.హర్షిత స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు హర్యానాలో నిర్వహించే ఫస్ట్ ఖేల్ ఇండియా నేషనల్ బాక్సింగ్ అండర్-14 విభాగంలో వీరు పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అభినందిస్తూ జాతీయ స్థాయిలో మెడల్ సాధించి నర్సీపట్నంకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్టేట్ స్కూల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన బొంతు మౌనికను ప్రత్యేకంగా ఎమ్మెల్యే అభినందించారు. శాప్ కోచ్ కె.అబ్బు, శేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్

- విశేషంగా ఆకట్టుకున్న పలు స్టాళ్లు
- ఐఏఎస్‌కు ఎంపికైన మౌర్య భరద్వాజ్‌కు సన్మానం


ఐఏఎస్ అధికారి మౌర్య భరద్వాజ్‌ను సత్కరిస్తున్న అధికారులు

నర్సీపట్నం: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. పాడి పరిశ్రమ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వెలుగు, గ్రామీణ ఉపాధి హామీ, విద్యా శాఖ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోషకాలతో కూడిన పిండి వంటకాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. జాతీయ స్థాయిలో సివిల్స్ 28వ ర్యాంక్ సాధించి ప్రస్తుతం శిక్షణలో ఉన్న నర్సీపట్నానికి చెందిన మౌర్య భరద్వాజ్‌ను కమ్యూనికేషన్ సహాయ సంచాలకుడు షఫి మహమ్మద్, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ సివిల్స్ ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్టాళ్లు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్లో భక్తిభావం పెంపొందిస్తాం


విజయేంద్ర సరస్వతికి అప్పన్న చిత్రపటం బహూకరిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

- ధార్మిక నర్సరీ ప్రోగ్రాం అమలుకు చర్యలు
- సింహాచలక్షేత్రంలోని శిల్ప సంపద అద్భుతం
- కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

సింహాచలం: దేశంలో ధార్మిక, సంస్కృతి పరమైన కార్యక్రమాలు ఎక్కువగా జరగాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆకాంక్షించారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువు, ఉద్యోగం కోసం యువత విదేశాలకు వెళ్లే అవసరం ఉండకూడదన్నారు. మన దేశంలోనే ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్నారు. మన దేశానికి, మన చరిత్రకు సంబంధించిన తెలుగు సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పకళ, నాదస్వరం, వీణావాద్యం, మృదంగం తదితర కళలను గౌరవించాలన్నారు. రాష్ట్రంలో వేదం, సంస్కృతం, కళలు తెలియజేసేందుకు ధార్మిక నర్సరీ ప్రోగ్రాం అమలు చేస్తామన్నారు. చిన్న వయసులోనే భక్తి, స్తోత్రాలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళ, అష్టావధానాలు నేర్పి భావితరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో గోవులను బాగా సంరక్షిస్తున్నారని తెలిపారు. దేశీయ గోవులను సంరక్షించాలని సూచించారు. మహిళల కోసం గుంటూరులో కంచికామాక్షి కన్యకా విద్యాలయం, మహిళలకు కుటుంబ వ్యవస్థ గురించి తెలిపేలా కాకినాడలో స్కూలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలో కంచి కామాక్షి కన్యకా విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఎంతో గొప్ప శిల్పకళా వైభవం సింహాచలంలో ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో విద్యార్థులతో నారసింహ కరావలంబం స్తోత్ర పఠనం చేయించారు. అంతకుముందు ఆలయ రాజగోపురం వద్ద ఆయనకు దేవస్థానం వైదికులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని స్పృశించి, బేడా మండంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. వేద స్వస్తిని నిర్వహించారు. స్వామి ప్రసాదం అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే విజయేంద్ర సరస్వతి సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల, వేద పాఠశాలలను సందర్శించారు.

అపరాల సాగుతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దాసు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దాసు

దేవరాపల్లి: రబీలో అపరాలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ టి. దాసు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం మారేపల్లిలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ వరి కోతల తర్వాత పొలాల్లో అపరాలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. మినప, పెసర తదితర అపరాలను ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేయాలన్నారు. అపరాల సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం స్థానికంగా లభ్యమయ్యే పదార్థాలతో ఘన జీవామృతం తయారీ చేసే విధానంపై సమగ్రంగా వివరించారు. ఏవో వై. కాంతమ్మ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజేత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

సమాచారమివ్వని తహసీల్దార్ కార్యాలయం పీఐవో

అప్పీలేట్ అథారిటీకి అప్పీల్ చేస్తానన్న దరఖాస్తుదారు


దరఖాస్తును చూపుతున్న నాగేశ్వరరావు

అనకాపల్లి రూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా చేసిన దరఖాస్తుకు నిర్ణీత గడువులోగా బదులివ్వని అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం పీఐవో(ప్రజా సమాచార అధికారి) పై అప్పీల్‌కు వెళ్లనున్నట్టు దరఖాస్తుదారుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు(బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు) బుధవారం తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని దక్షిణ ప్రాంతానికి సంబంధించిన ఎస్ఎఫ్ఏ వివరాలను ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపడం దారుణమని, సమాచార హక్కు చట్టం లక్ష్యానికి ఇక్కడి అధికారులు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. దరఖాస్తు చేసిన తాను పలుమార్లు కార్యాలయంలో సంప్రదించినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ ఇక్కడి కార్యాలయంలో సిబ్బంది కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై నిబంధనల ప్రకారం సమాచారమివ్వని అధికారులపై అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

మహారాణిపేట: 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కారించాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అధికారులను ఆదేశించారు. సర్కిల్ కార్యాలయంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య మీటింగ్ హాలులో బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ పూర్తి చేసిన పనుల పురోగతి నివేదికలను సమర్పించాలన్నారు. జగనన్నకు చెబుదాంలో నమోదైన సమస్యలను 24 గంటల్లోగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో పూర్తయిన గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు ఖర్చు లేకుండా తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సకాలంలో రీడింగ్‌లు పూర్తి చేసి వినియోగదారులకు బిల్లులను అందజేయాలని, ఈ ప్రక్రియలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఈ నెల 20లోగా రిలీజ్ చేయాలన్నారు. డైరెక్టర్ (ప్రాజెక్టు) డాక్టర్ ఎ.వి.వి సూర్యప్రతాప్, డైరెక్టర్(ఫైనాన్స్) హెచ్ఆర్‌డీ చంద్రం, జనరల్ మేనేజర్ వి.విజయలలిత, సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్, అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణతో సమస్యలకు చెక్

- జోగారావుపేట–గణపర్తి రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు గ్రామాల ప్రజలకు మేలు


మట్టితో వెడల్పు చేసి విస్తరించిన జోగారావుపేట–గణపర్తి రోడ్డు

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెం శివారు జోగారావుపేట–గణపర్తి గ్రామాల మధ్య రోడ్డును విస్తరించారు. దీంతో రాకపోకలు సులభతరం అయ్యాయని రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డు నిర్మాణం పూర్తి అయితే మూడు మండలాల ప్రజలకు దూరం తగ్గి ప్రయాణం సదుపాయంగా మారగలదని ఆశిస్తున్నారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ప్రత్యేక చొరవతో, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో స్థానికుల అభ్యర్థన మేరకు తారు రోడ్డు మంజూరైంది. ఇందుకు ఉపాధి హామీ పథకం కింద రూ.కోటీ 80 లక్షలు మంజూరు చేశారు. దీనిలో 2.2 కిలోమీటర్ల పొడవున తారు రోడ్డు వేయడంతో పాటు 750 మీటర్ల పొడవున రహదారికి ఆనుకుని ఉన్న రోలు గెడ్డ నుంచి ముంపు లేకుండా గోడను 2.5 నుంచి 3 మీటర్ల పొడవున నిర్మించడానికి ప్రతిపాదించారు. రోడ్డును వెడల్పు చేయడానికి రైతులను ఒప్పించి భూములను సమకూర్చారు. దీంతో గత ఏడాది పనులు చేపట్టారు. మట్టి వేసి రోడ్డును చదును చేసి వెడల్పు చేశారు. దీనిపై మెటల్ వేసి తారు రోడ్డు వేయాల్సి ఉంది. అయితే ఒక రైతు రోడ్డులో కోల్పోనున్న భూమికి పరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించడంతో సుమారు నాలుగు నెలల క్రితం పనులు నిలిచిపోయాయి. అయితే ఆ రైతును ఒప్పించి రోడ్డు పూర్తి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.గతంలో ఇరుగ్గా పొలాల మధ్య నుంచి ఉన్న రోడ్డు ప్రస్తుతం మట్టి వేసి విస్తరించడంతో విశాలంగా తయారై.. రాకపోకలకు అనువుగా మారింది. మారుమూలన ఉన్న జోగారావుపేట గ్రామానికి అనకాపల్లి వైపు తారు రోడ్డు ఉంది. మరోవైపు మునగపాక మండలం గణపర్తి వైపు సరైన రోడ్డు లేదు. మట్టి రోడ్డు ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం వచ్చిందంటే బురదమయంగా మారి గోతులతో నిండి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితికి రోడ్డు చేరుకుంటుంది. వాహనాలు గోతుల్లో పడి మరమ్మతులకు గురయ్యే స్థితి. జోగారావుపేట విద్యార్థులు హైస్కూలు చదువులకు గణపర్తికి రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉండేది. దీంతో కొంత మంది కొత్తపల్లి హైస్కూలుకు వెళ్లి వస్తున్నారు.

ఇక్కడ పండిన వ్యవసాయ ఉత్పత్తులు, తయారు చేసిన బెల్లం అనకాపల్లి తదితర ప్రాంతాలకు తరలించాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. అదే రోడ్డు నిర్మాణం అయితే గణపర్తి, చూచుకొండ, జోగారావుపేట గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ ఉత్పత్తులు, బెల్లం అనకాపల్లి మార్కెట్‌కు తరలించడానికి అనుకూలం కానుంది. అలాగే జోగారావుపేట గ్రామానికే కాకుండా మునగపాక మండలం గణపర్తి, చూచుకొండ, మెలిపాక, అచ్యుతాపురం మండలం ఎర్రవరం తదితర గ్రామాల ప్రజలు అనకాపల్లికి రాకపోకలు సాగించడానికి ఐదారు కిలోమీటర్ల దూరంపైగా తగ్గుతుంది. ఇప్పుడు నరసింగబిల్లి మీదుగా అనకాపల్లి చేరుకోవాలంటే దూరం ఎక్కువ అవుతుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఎంపీ వెంకట సత్యవతి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మంత్రి అమర్‌నాథ్ సహకారంతో తారు రోడ్డు మంజూరు చేశారు. ప్రస్తుతానికి మట్టి రోడ్డు రాకపోకలకు అనువుగా ఉంది. వర్షాలు వస్తే బురదమయం అయి ఎప్పటిలాగే ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. దీని దృష్ట్యా ముందుగా సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే తాము దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోగలవని స్థానికులు ఆశిస్తున్నారు.

రోడ్డు వెడల్పు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది



జోగారావుపేట–గణపర్తి రోడ్డును వెడల్పు చేసి విస్తరించడం వల్ల సౌకర్యవంతంగా ఉంటుంది. వర్షాలు రాకముందే ప్రత్యేక శ్రద్ధ వహించి తారు రోడ్డుగా నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అప్పలస్వామి, రైతు, జోగారావుపేట.

ఉపాధ్యాయులపై వేధింపులు తగదు


సంఘీభావం ప్రకటిస్తున్న ఫ్యాప్టో జిల్లా నేతలు

అనకాపల్లి రూరల్: ఉపాధ్యాయులపై ఇటీవల గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నతాధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఫ్యాప్టో జిల్లా నేతలు అభిప్రాయపడ్డారు. బుధవారం అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందుల గురించి చర్చించారు. ఫ్యాప్టో చైర్మన్ చిన్నబ్బాయి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారుల వేధింపులతో ఉపాధ్యాయులంతా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వెంటనే అలాంటి చర్యలను విడనాడాలని ఉన్నతాధికారులను కోరారు. విద్యా సంవత్సరం ఆఖర్లో ఉపాధ్యాయులంతా స్వేచ్ఛగా విద్యా బోధన చేసేలా అధికారులు అవకాశం కల్పించాలని కోరారు. ఇటీవల విధి నిర్వహణలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వారంతా సమావేశంలో ప్రస్తావించారు. సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ వై. సుధాకర్, కోచైర్మన్ సాయి ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీలు ప్రేమ్‌కుమార్, ఎస్. సన్యాసినాయుడు, కె. రమణాజీ, కార్యవర్గ సభ్యులు వి. శ్రీలక్ష్మి, శాస్త్రి, ఎ. రవి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన


విద్యార్థినులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి త్రిపర్ణ

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి త్రిపర్ణ బుధవారం సందర్శించారు.

విద్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. ఉన్నత ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలన్నారు.

12న ఉచిత నేత్ర వైద్యశిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక భీమునిగుమ్మం సీతారామాంజనేయ దేవాలయంలో ఈ నెల 12న శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆప్టికల్స్ అధినేత పూసర్ల రాజా బుధవారం తెలిపారు. ఈ శిబిరాన్ని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా మిషన్ అంత్యోదయ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

ఎంపీడీవో రమేష్‌నాయుడు

సబ్బవరం: మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని మండలంలోని పలు శాఖల అధికారులకు ఎంపీడీవో రమేష్ నాయుడు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో దీనిపై బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంక్షేమ అధికారులు, గణాంక సహాయకులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 26 శాఖలకు సంబంధించి 216 ప్రశ్నలకు సమాధానాలను మూడు రోజుల్లో పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.దీనికి సంబంధించిన యాప్ గురువారం ఓపెన్ అవుతుందని, వెంటనే సేకరించిన ఆయా సమాధానాలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. యాప్‌లో అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏవో ఎస్. బాబూరావు,ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరం ప్రారంభించాలి

నక్కపల్లి : గొడిచర్లలో ప్రభుత్వం కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. బుధవారం ఆయన గృహ నిర్మాణశాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి జగనన్న లేఅవుట్‌లో సమావేశం నిర్వహించారు. ప్లాట్లు పొందిన లబ్ధి దారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. రోడ్డు, ఇతర సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఇళ్ల స్థలాల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, ప్లాట్లు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని అన్నారు. కాని పక్షంలో అర్హులైన వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ బిల్లులను ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. వాడుకనీరు, విద్యుత్, రహదారి సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు.

నేడు అభయాంజనేయస్వామి తీర్థం

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో గురువారం అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం జరగనుంది. ఇందుకు భారీగా ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మలసాల కుమార్‌రాజా తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలు, మహిళల కోలాటాలు, తోడపెద్దు సేవలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటుతో పాటు బాణసంచా కాల్చనున్నట్లు తెలిపారు.

సచివాలయాల్లో ఉచిత ధ్యాన శిక్షణ

కశింకోట: మండలంలో సచివాలయాల వారీగా ఈ నెల 13 నుంచి ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. సంపతిపురం వద్ద ఉన్న రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రజలకు నిర్దేశించిన రోజు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

12న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న కశింకోట మండలం సాయినగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను నాటి, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లిటౌన్: మండలంలోని తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక చోడవరం–అనకాపల్లి రహదారి రామచంద్ర థియేటర్ వద్ద బుధవారం చెరకు ట్రాక్టర్‌పై టీడీపీ నేతలు నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 13వేల మంది రైతులు ప్రధాన వాణిజ్య పంటగా చెరకును సాగు చేస్తున్నారన్నారు. తక్షణమే కర్మాగారాన్ని తెరిపించి, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు


పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట: మండలంలోని పంచాయతీల పరిధిలో ఉన్న 69 చెరువులను గుర్తించి అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఇందుకు అవసరమైన అంచనాలను రూపొందించాలని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి పథకం సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గుర్తించిన చెరువుల్లో పూడిక తీయడం, గట్లు బలపర్చడం, మొక్కలు నాటడం, పార్కుగా అభివృద్ధి చేయడం తదితర పనులు చేపట్టాలని తెలిపారు. ఇందుకు అవసరమైన అంచనాలు తయారు చేసి నివేదించాలని కోరారు.

11న గౌరీపరమేశ్వరుల ఉత్సవం


ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుడివాడ హిమగౌరి


ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద కొలువుదీరిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈ నెల 11న భారీఎత్తున నిర్వహించనున్నారు. ఉత్సవ కరపత్రాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి మిందిలోని వారి స్వగృహంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి రామకోటేశ్వరరావు, వేగి దొరబాబు, ఆడారి నరసింగరావు, దాడి నాగరాజు, నాగు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గౌరీపరమేశ్వరుల మహోత్సవ కరపత్రాన్ని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమభాస్కర్, 81వ కార్పొరేటర్ లక్ష్మీ సౌజన్య, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం


సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం అనకాపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ వర్మ అభిప్రాయపడ్డారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులు, స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, 30 రకాల విత్తనాలతో పండించే వివిధ రకాల ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. పురుగు మందుల వినియోగం లేని పంటల సాగు, కిచెన్ గార్డెన్ పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ అనకాపల్లి డివిజన్ సిబ్బంది అప్పలరాజు, సత్యారావు, రమణ, రేవతి, సాయి, చంటి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయకర్త లిఖిత

కశింకోట: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సోషల్ బిహేవియర్ అండ్ చేంజ్ కమ్యూనికేషన్ (ఎస్‌బీసీసీ) జిల్లా సమన్వయకర్త లిఖిత కోరారు. మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో బుధవారం స్వాభిమాన్ కార్యక్రమాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రక్తహీనతకు గురవుతుంటారని, దీని నివారణకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యరీత్యా 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేయరాదని తెలిపారు. సామాజికంగా ఎదురయ్యే సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ మాట్లాడుతూ మహిళల రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రక్షణకు దిశ వంటి అనేక చట్టాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి రైతులకు మద్దతు ధర పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

అనకాపల్లి రూరల్: పాడి రైతులకు గిట్టుబాటు ధర పెంచాలని పాల ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఎస్. రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. లీటరుకు 4 రూపాయలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే పెంచి పాల ఉత్పత్తిదారులను ఆదుకోవాలన్నారు. అనకాపల్లి సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పాల ఉత్పత్తిదారులకు మేలు కలిగేలా లీటరుకు రూ.4 పెంచాలని, విశాఖ డెయిరీని సహకార రంగంలోకి తెచ్చి రైతులకు లీటరుకు రూ.10 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. కేరళలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులను ఎన్నో రకాలుగా ఆదుకుంటోందన్నారు. అందుకే అక్కడి రైతులంతా ఆ ప్రభుత్వానికి ప్రతి ఎన్నికలో మద్దతుగా ఉంటున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధిఅ హామీ పథకానికి సుమారు రూ.30 వేల కోట్లు తగ్గించడంపై పలువురు రైతు నేతలు మండిపడ్డారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని నేతలు కోరారు. సమావేశంలో రైతు సంఘం నేతలు ఎ. బాలకృష్ణ, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి


పాయకరావుపేట మెయిన్‌రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌డీవో జయరాం

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణానికి అందరూ సహకరించాలని నర్సీపట్నం ఆర్‌డీవో జయరాం కోరారు. మెయిన్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టడం కోసం ఆయన బుధవారం సంబంధిత అధికారులతో పీఆర్ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరైందన్నారు. చిన్నవర్తకులు సమస్యల కారణంగా రోడ్డు నిర్మాణం ఆలస్యమవుతున్నదన్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే పట్టణం కూడా అభివృద్ధి చెందుతుందని, మౌలిక వసతులు కల్పన కూడా జరుగుతుందని తెలిపారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేయడానికి సహకరించాలన్నారు. రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత యథా ప్రకారం వారి వ్యాపారాలు సాగించుకోవచ్చునన్నారు. ఎంతో కాలంగా నిర్మాణం చేయకపోవడం వల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు నిర్మాణానికి తీసుకోవలసిన రోడ్డు కొలతలను మరలా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కన వున్న వ్యాపారుల జాబితాను కూడా తయారు చేయాలని ఆదేశించారు. మండల తహసీల్దార్ కె.జయప్రకాష్, ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు

పరవాడ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మండలంలో నాయుడుపాలెం, పరవాడ గ్రామాల్లో రూ. 72.08 లక్షల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. రాముడుగారి గ్రామంలో రూ.7లక్షలతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఇంటింటి కుళాయి పథకం, సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.11 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాలను ప్రారంభిస్తారు. ముత్యాలమ్మపాలెంలో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.13.80 లక్షలతో జెడ్పీ పాఠశాలలో నిర్మించిన డైనింగ్ హాల్‌ను,సిమ్మన్నగారి దొడ్డిలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును వినియోగంలోని తెస్తారు. కోరంగివానిపాలెంలో రూ.12 లక్షలతోనిర్మించిన కుళాయిలు, రూ.11లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలను ప్రారంభిస్తారు.

క్లుప్తంగా

ఏప్రిల్ 2న వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణోత్సవం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఏప్రిల్ 2వ తేదీన స్వామి వారి తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం చేయించేందుకు ఆసక్తి గల దంపతులు 81213 16268 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆన్‌లైన్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త


మాట్లాడుతున్న ఎస్‌ఐ అలీ

మునగపాక : బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఫేక్ కాల్స్ చేస్తూ మీకు బహుమతులు వచ్చాయంటూ మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబరు చెప్పాలంటూ మోసాలకు పాల్పడుతుంటారన్నారు. ఆన్‌లైన్ యాప్స్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిటీ ఏర్పాటుకు వినతి

అనకాపల్లిటౌన్: ఆహార సలహా సంఘాలు (ఫుడ్ కమిటీ) ఏర్పాటు చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు అందేవని, ప్రస్తుతం రెండు, మూడు సరకులతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి పేదల సమస్యలు తెలుసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి కరాటే చాంపియన్ షిప్ పోటీలు

అనకాపల్లిటౌన్: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ సీఎం కప్–2023 పోటీల ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ బుధవారం పరిశీలించారు. ఈ పోటీలు విశాఖలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వివిధ దేశాల నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు హాజరవుతారని ఆయన చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 9,446 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,150
మొదటి రకం	3,300	3,760
రెండో రకం	3,060	3,440
మూడో రకం	2,930	3,080

అనకాపల్లి సినిమాలు

మైఖేల్	- రాజా
సిందూరం	- సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
పఠాన్	- పర్తిసాయి
వీరసింహారెడ్డి	- వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 111 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–13 యూనిట్లు, బీ పాజిటివ్–56 యూనిట్లు, బీ నెగెటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–37 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్యను 91828 34480 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 437 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 416 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 94411 08144 నంబరులో సంప్రదించవచ్చు.